# కౌంటింగ్ సెంటర్ వద్ద పటిష్ట బందోబస్తు

- సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ
- లెక్కింపు సందర్భంగా 144 సెక్షన్
- జగిత్యాల ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 2 : శాసనసభ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకుంటన్నామని జగిత్యాల ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ పేర్కొన్నారు. జగిత్యాల అర్బన్ కాలనీ వద్ద గల వీఆర్‌కే కళాశాలలో నిర్వహిస్తున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పద్మనాయక ఫంక్షన్ హాల్లో కౌంటింగ్ కేంద్రంలో చేపట్టాల్సిన విదులపై శనివారం బ్రీఫింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి కృషి చేసిన ప్రతి ఒక్క అధికారి, సిబ్బందికి అభినందనలు తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. కౌంటింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు, ఏజెంట్లు, లెక్కింపునకు హాజరయ్యే అధికారులు మొబైల్ ఫోన్స్, కెమెరాలు, కత్తులు, పేలుడు పదార్థాలు, యాసిడ్, మొదలైన వస్తువులు లెక్కింపు కేంద్రంలోకి తీసుకురావద్దని తెలిపారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ఉదయం ఆరు నుంచి సోమవారం ఉదయం ఆరు గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఆ సమయంలో ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు, పటాకులు కాల్చడం, సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు పూర్తిగా నిషేధమని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట భద్రత ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రమైన వీర్‌కే కళాశాల పరిసర ప్రాంతాలను డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తామన్నారు. ఎలక్షన్ కమిషన్ ద్వారా జారీ చేయబడిన గుర్తింపు కార్డులు ఉన్న వారిని మాత్రమే లెక్కింపు కేంద్రంలోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు. వీఆర్‌కే కళాశాల వద్ద ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా జగిత్యాల-కరీంనగర్‌కు వెళ్లే వాహనాలను ట్రాఫిక్ ఇబ్బందుల నేపథ్యంలో పలు మార్గాల్లో మళ్లిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కౌంటింగ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. ట్రాఫిక్ డైవర్షన్ పై అధికారులకు పలు సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ప్రభాకర్‌రావు, భీమ్ రావ్, జనార్దన్ రెడ్డి, డీఎస్పీలు వెంకటస్వామి, రవీంద్రారెడ్డి, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్



కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ

## తెలంగాణ ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల స్పెషల్ డ్రైవ్

జగిత్యాల రూరల్, డిసెంబర్ 2: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ అడ్మిషన్లకు తెలంగాణ ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ చేపట్టిందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్ నాగేశ్వర్ రావు, జగిత్యాల జిల్లా ఏఐ కోఆర్డినేటర్ శ్యామ్ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబర్ 11 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9849266786 సెల్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## మొగిలిపేటలో మృతుడి బంధువుల ఆందోళన

మల్లాపూర్, డిసెంబర్ 2: ముత్యంపేట శివారులో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మొగిలిపేటకు చెందిన అలిశెట్టి చంద్రప్రకాశ్ (32) దవాఖానలో చికిత్స పొందుతు మృతి చెందిన సంగతి తెలిసిందే. కాగా శనివారం మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నవీన్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేశారు.

## మెట్‌పల్లిలో సినీ ఫక్కీలో చోరీ

మారుతీనగర్, డిసెంబర్ 2 : పట్టణంలో ఓ మహిళా రైతునుంచి మూడున్నర తులాల బంగారం ఎత్తుకెళ్లిన ఘటన శనివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని దుబ్బవాడలో నివాసముంటున్న ఆకుల చిన్నగంగు అనే మహిళా రైతు తోటకు నడుచుకుంటూ వెళ్తుండగా ఎస్సారెస్పీ క్యాంపు వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి ...అమ్మా మీకు రూ.1.50 లక్షలు, తులం బంగారం లాటరీలో వచ్చిందంటు మాయమాటలతో నమ్మబలికాడు. దీనికోసం ఆధార్ కార్డు కావాలంటూ ద్విచక్రవాహనంపై ఆమె ఇంటికి తీసుకెళ్లాడు. ఇంటి వద్ద ఆధార్‌కార్డు తీసుకున్న తర్వాత నీ మెడలో ఉన్న బంగారం చూసి లాటరీ డబ్బులు ఇవ్వరని ఆమెకు తెలిపాడు. దీంతో ఆమె మెడలో ఉన్న బంగారాన్ని ఆ గుర్తు తెలియని వ్యక్తి ముందే తీసి ఓ సంచిలో పెట్టుకొని ఎదురుగా ఉన్న తల్లి ఇంట్లో పెట్టి ఆ వ్యక్తి వాహనంపై వెళ్లింది. పోలీస్‌స్టేషన్ సమీపంలోకి రాగానే అతడు తన ద్విచక్రవాహనాన్ని ఆపి తన ఫైల్ ఇంటి దగ్గర ఉండిపోయిందని, తీసుకొని వస్తానని ఆమెను దింపి వెళ్లాడు. అనంతరం చిన్నగంగు తల్లి ఇంటికి వెళ్లి మీ కూతురు ఇక్కడే ఆధార్‌కార్డు మర్చిపోయిందని, ఇవ్వమని ఆ వృద్ధురాలిని అడిగాడు. ఎక్కడ పెట్టిందో నాకు తెలియదని చెప్పి ఆమె వెతుకుతుండగా బంగారాన్ని తీసుకొని జోకించడానికి తీసుకురమ్మనదని నమ్మించే ప్రయత్నం చేశాడు. అంతలో వృద్ధురాలి మనుమడు అక్కడి రావడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న చిన్న గంగును గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇక్కడ ఎందుకున్నావని అడుగగా జరిగిన విషయాన్ని తెలిపింది. ఎవడో చెప్పిన మాటలు ఎందుకు నమ్మావని ఇంటికి వెళ్లు అని చెప్పడంతో వెంటనే ఇంటి తిరిగి వచ్చింది. ఇంట్లో తన బంగారం సంచి కనబడక పోవడంతో ఆ గుర్తు తెలియని వ్యక్తి ఎత్తు కెళ్లినట్లు గుర్తించి జరిగిన మోసాన్ని తన కుమారుడు ఆకుల రాజేశ్‌కు తెలిపింది. కుమారుడితో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 'సతీశ్‌కుమార్‌దే విజయం'

సైదాపూర్, డిసెంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్ విజయం సాధిస్తారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, ప్రధాన కార్యదర్శి చెల్మల్ల రాజేశ్వర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాలవారికి న్యాయం జరిగిందని, ప్రజామద్దతు కేసీఆర్‌కే ఉందన్నారు.

## ర్యాలీలకు అనుమతి లేదు

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 2: మానకొండూర్ నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో ఎలాంటి ర్యాలీలు, సమావేశాలకు అనుమతులు లేవని ఎన్నికల రిటర్నింగ్ అధికారి లక్ష్మీకిరణ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే మరుసటి రోజు పర్మిషన్ ఉంటేనే విజయోత్సవ ర్యాలీలు నిర్వహించుకోవాలని తెలిపారు. కాగా, మొత్తం 23 రౌండ్లలో కౌంటింగ్ జరుగనుండగా, ప్రతి రౌండ్ రౌండ్‌కు వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.

## వైద్య చికిత్స కోసం ఎల్ వోసీలు అందజేత

శంకరపట్నం, డిసెంబర్ 2: అనారోగ్యంతో వైద్య చికిత్స పొందుతున్న ఇద్దరికి ప్రభుత్వ ఆర్థిక సాయం అందింది. ముత్తారం గ్రామానికి చెందిన నూనె శ్రీనివాస్ హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. ఇతడి చికిత్స కోసం సాంస్కృతిక సారథి ఛైర్మన్, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ చొరవతో ప్రభుత్వం రూ.2.50 లక్షల విలువైన ఎల్‌వోసీని మంజూరు చేసింది. అలాగే కేశవపట్నం గ్రామానికి చెందిన చెందిన పాశం మల్లయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతుండగా, ఇతడికి కూడా రూ. 2.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఎల్‌వోసీలను బాధిత కుటుంబాలకు ఎంపీహెచ్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సముద్రాల సంపత్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్‌తో పాటు ఇందుకు కృషి చేసిన ఎంపీహెచ్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సముద్రాల సంపత్‌కు ఆయా కుటుంబాల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

కొడిమ్యాల, డిసెంబర్ 2 : మండలంలోని పూడూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇరుమల్ల అరవింద్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికకైనట్లు పీడీ లక్ష్మీరాంనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలలో పెద్దపల్లి జిల్లాలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ -17 బాలుర విభాగంలో జగిత్యాల నుంచి పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 5న జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో ఈ విద్యార్థి పాల్గొంటారన్నారు. అరవింద్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రాజు, ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.

## సర్వసభ్య సమావేశం వాయిదా

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 2 : ఇబ్రహీంపట్నం మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ జాజాల భీమేశ్వరి తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో జరగాల్సిన సర్వసభ్య సమావేశాన్ని ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాయిదా వేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## లారీ బోల్తా : డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ధర్మపురి, డిసెంబర్ 2: మండలంలోని ఆక్సాయిపల్లి గ్రామంలోని మూలమలుపు వద్ద జాతీయ రహదారిపై శనివారం లారీ బోల్తాపడి డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల నుంచి ధాన్యం లోడుతో ధర్మపురి వైపు వస్తున్న లారీ ఆక్సాయిపల్లి మూలమలుపు వద్దకు చేరుకోగానే అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గోదావరిఖనికి చెందిన లారీ డ్రైవర్ షేక్ రజాక్‌కు తీవ్రగాయాలయ్యాయి. మరో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రుడిని 108 వాహనంలో జగిత్యాల దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేన్నట్లు ఎస్ఐ దత్తాద్రి తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆట వస్తువులు




కోరుట్ల: కోరుట్లలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆట వస్తువులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కోరుట్ల, డిసెంబర్ 2: పట్టణంలోని మార్కండేయ వీది ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లియో క్లబ్ ప్రతినిధులు శనివారం ఆట వస్తువులను అందజేశారు. క్లబ్ మల్టిపుల్ ప్రెసిడెంట్ లయన్ గుంటుక రవిరాజ్ జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు రూ. 10 వేల విలువైన ఆట వస్తువులు పంపిణీ చేశామని క్లబ్ ప్రతినిధులు తెలిపారు. సమాజ సేవలో లియో క్లబ్ ఎప్పుడూ ముందుంటుందని చెప్పారు. ఇక్కడ లయన్స్ క్లబ్ కోశాధికారి కొండబత్తిని అనంత కృష్ణప్రసాద్, క్లబ్ ప్రతినిధులు మంచాల జగన్, గుంటుక మహేశ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## యువతి వివాహానికి లయన్స్‌క్లబ్ చేయూత

మారుతీనగర్, డిసెంబర్ 2 : పట్టణంలోని బంటుపేట కు చెందిన ఎనుగందుల లక్ష్మీగోపాల్ ఇటీవల మృతి చెందాడు. శనివారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దొంతుల ఆంజనేయులు ఆధ్వర్యంలో ఎనుగందుల లక్ష్మీగోపాల్ కూతురు వివాహానికి రూ.5వేలు, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఇక్కడ లయన్స్‌క్లబ్ ప్రతినిధులు శ్రీధర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, శ్రీకాంత్, కోటగిరి తిరుమలాచారి తదితరులు ఉన్నారు.



నిరుపేద కుటుంబానికి నగదు, నిత్యావసర వస్తువులు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు